సాక్షి
జనగామ

బుధవారం | 9 | ఆగస్టు | 2023



బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం - 8లో▸

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.



అడవే అమ్మఒడి.. - 8లో▸

బాహ్య ప్రపంచానికి సంబంధం లేని జీవన విధానం ఆదివాసీలది. ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా.. ఇప్పటికీ వారి ఆచారాలను అలాగే కొనసాగిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32°/26°

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'గృహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణ

జనగామ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. జనగామ మున్సిల్‌తో పాటు 12 మండలాల పరిధిలో ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక సాయానికి వందల సంఖ్యలో నిరుపేద కుటుంబాలు దరఖాస్తులు అందించారు. ప్రతి నియోజకవర్గానికి 3వేల చొప్పున లబ్ధిదారులకు సాయం చేస్తుండగా, జిల్లాకు 9 వేలు రానున్నాయి. కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగనుంది. కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశీలన జరిపి, అర్హులను గుర్తించిన తర్వాత, జిల్లా మంత్రి ఆధ్వర్యంలో అర్హత కలిగిన వారికి సాయం అందిస్తారు. ఈ నెల10వ తేదీ వరకు మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కాగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే రూ.3లక్షల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు.

రూ.30 కోట్లు విడుదల చేయాలి



దేవరుప్పుల: గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన రూ.30 కోట్లు సత్వరమే విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య మంగళవారం డిమాండ్ చేశారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర మండల కేంద్రంతో పాటు కామారెడ్డిగూడెం, ధర్మాపురం, రంబోజీగూడెం, మాధాపురం, చౌడూరు, కడవెండి, సీతారాంపురం, సింగరాజుపల్లి, నీర్మాల, రామరాజుపల్లిలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకతీతంగా గీత కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు పరిదులు భాస్కర్, ఉప్పునూతుల అయోధ్య, వడ్లకొండ వెంకటేష్, మహేందర్, మండల కార్యదర్శి తీగల దయాకర్, పెద్ది కృష్ణమూర్తి, దొమ్మాట రాజు, ఓడపల్లి యాకయ్య, యాకయ్య, యాదగిరి, అశోక్, రాములు, రామ్మూర్తి, సత్తయ్య, రామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులతోనే ప్రభుత్వ పతనానికి నాంది



చిల్పూరు: 34 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు దీక్షలు చేస్తున్నా.. వారి సమస్యలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, జీపీ కార్మికులతోనే ప్రభుత్వ పతనానికి నాందిగా మారుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, బొజ్జపల్లి సుభాష్‌లు అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న దీక్షలకు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల దిలీప్, నాయకులు గాలి రాజు, గంటె ఉపేందర్, పన్నీరు అశోక్, గొల్లపల్లి వాసు, బాల్నె శ్రీనివాస్, ముక్కెర శ్రవణ్, ఓరం శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



జనగామ రూరల్: సీఎం కేసీఆర్‌ను జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రగతి భవన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనగామ మెడికల్ కాలేజీ భవన నిర్మాణ టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలన్నారు.

వాతావరణంలో వచ్చిన మార్పులతో జనం జ్వరాల బారిన పడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో పాటు ఒంటి నొప్పులతో ఆస్పత్రులకు క్యూ కడుతుంటే... కళ్ల కలక కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎర్రగా బారిన కళ్లతో వారం రోజుల పాటు అవస్థలు పడుతున్నారు. దీంతో జిల్లా ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు రోగులతో నిండి పోతున్నాయి. ఓపీలో వందల సంఖ్యలో పేర్లు నమోదు చేసుకోగా.. పదుల సంఖ్యలో అడ్మిట్ కేసులు పెరుగుతున్నాయి.



భయపెడుతున్న 'కళ్ల కలక'

జిల్లాలోని ఆస్పత్రుల్లో రోగుల నమోదు వివరాలు

కళ్ల కలక కేసులు:	1,100
ఓపీ కేసులు :	10,000
అడ్మిట్ కేసులు:	450

ఎర్రగా మారుతున్న కళ్లు

- జిల్లాలో 1,100 కేసులు నమోదు
- అనధికారికంగా మరో 10వేలకు పైగానే..
- ఆస్పత్రుల్లో క్యూ కడుతున్న జనాలు

జనగామ: జిల్లాలో వైరల్ ఫీవర్లు.. కళ్ల కలక కేసులు పెరుగుతున్నాయి. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే కొనసాగుతుండగా... జ్వరాలు, వాంతులు, విరేచనాలు, ఒంటి నొప్పుల కేసులు నమోదవుతున్నాయి. జనగామలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు 12 మండలాల పరిధిలో 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ (సీహెచ్‌సీ) సెంటర్లు ఉన్నాయి. ఇటీవల భారీగా కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత... ఉదయం పూట ఎండలు.. రాత్రి చలితో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంది. దీంతో బీపీ, షుగర్, ఇతర వ్యాధిగ్రస్తులతో పాటు ఆరోగ్యంగా ఉన్న వారు సైతం వైరల్ ఫీవర్, కళ్ల కలక బారిన పడుతున్నారు. జిల్లాలో కళ్ల కలక కేసులు ఇప్పటి వరకు 11 వందల కేసులు నమోదు కాగా, అనధికారికంగా 10 వేలకు పైగానే ఉంటారని తెలుస్తుంది.

జిల్లాలో ఆస్పత్రి కిటకిట

జిల్లా ఆస్పత్రికి రికార్డు స్థాయిలో ఓపీ పెరుగుతోంది. వైరల్ ఫీవర్, కళ్ల కలక, వాంతులు, విరేచనాలు, ఒంటి నొప్పులు, పాము కాటు బాధితులు ఎక్కువగా ఉంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పైరెండు అంతస్తుల్లో ఉన్న జనరల్ వార్డుల్లో పేషెంట్లతో నిండి పోయాయి. అడ్మిట్ కేసులు పెరుగుతుండడంతో, జనరల్ వార్డు పక్కనే ఆరుబయట బెడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కేసుల తీవ్రత సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఒకే బెడ్డుపై ఇద్దరికి చికిత్సలు అందిస్తున్నారు. పది రోజులుగా జిల్లా ఆస్పత్రిలో ఓపీ, ఎమర్జెన్సీ ఓపీలో 4వేల మంది పేర్లు నమోదు చేసుకోగా, వివిధ రోగాలతో బాధపడుతూ 276 మంది అడ్మిట్ అయ్యారు. కాగా 231 మంది కళ్లకలకతో ఆస్పత్రిలో చేరగా, వైద్యులు పరీక్షలు చేస్తున్నారు. అలాగే పాముకాటుకు గురై వచ్చిన వారికి కూడా చికిత్స చేస్తున్నారు.



ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలో నిల్చున్న పేషెంట్లు

పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోనూ అంతే..

గ్రామ పంచాయతీ శానిటేషన్ కార్మికులు సమ్మె చేస్తుండడంతో పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా మారింది. దీంతో దోమలు, క్రిమికీటకాలు పెరిగి, ప్రజలను రోగాల బారిన పడేస్తుంది. గడిచిన పదిరోజుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీల్లో కలుపుకుని 10వేల పైచిలుకు ఓపీ నమోదు కాగా, సుమారు 450 మందికి పైగా అడ్మిట్ చేసుకున్నారు. 849 మంది కండ్ల కలకతో బాధపడుతుండగా... ఎర్రబడిన కళ్లను నయం చేసేందుకు వైద్యులు మందు గోలీలతో పాటు జాగ్రత్తలు సూచిస్తున్నారు.

కళ్లకలకకు కారణమిదే..

గతంలో ఎన్నడూ లేని విధంగా కళ్లకలక వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. రహదారులపై పేరుకు పోయిన దుమ్ము, ధూళితో పాటు వాతావరణంలో గంటగంటకు ఏర్పడుతున్న మార్పులతో కంటిపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. దీంతో పది మందిలో ముగ్గురి కళ్లు ఎర్ర బారుతున్నాయి. ఐదేళ్ల చిన్నారులు, విద్యార్థుల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు కండ్ల కలక బారిన పడుతున్నారు. ఎర్రబారిన కళ్లతో ప్రమాదం లేకున్నా, చిన్నపిల్లలు మాత్రం అవస్థలు పడుతున్నారు. ఇది ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుండడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీలో కళ్ల కలక పరీక్ష చేస్తున్న వైద్యుడు

జాగ్రత్తలు తీసుకోవాలి..



కళ్ల కలక లక్షణాలు కనిపిస్తే కళ్లను రెండు చేతులతో నలపొద్దు. శుభ్రమైన టిష్యూ కాగితం, చేతి గుడ్డతో కళ్లు తరచూ తుడుచుకోవాలి. కళ్లు ఎర్రగా మారిన బాధితులు నల్లటి అద్దాలు పెట్టుకుంటే కాస్త ఉపశమనంగా ఉంటుంది. కంటి సమస్యలు రాకుండా డాక్టర్లు సూచించిన యాంటిబయాటిక్స్ చుక్కల మందులను వాడాలి. వేడిచేసి చల్లార్చిన నీటితో కళ్లు శుభ్రం చేసుకోవాలి. కాంటాక్ట్ లెన్స్ వాడేవారు కొన్ని రోజులు పెట్టుకోక పోవడం మంచిది.

- డాక్టర్ సుగుణాకర్‌రాజు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ నూరొద్దిన్

బచ్చన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు కూడా మార్పు చెందుతూ అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని అడిషనల్ డీఆర్‌డీఓ నూరొద్దిన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రచన మండల సమాఖ్య కార్యాలయంలో ఎంఎస్ అధ్యక్షురాలు చైతన్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 40 గ్రామ సంఘాలు, 1,045 చిన్న సంఘాలు, 11,832 మంది సభ్యులు ఉన్నారన్నారు. 2022–23 సంవత్సరానికి గానూ రూ.4.35 కోట్లు శ్రీ నిధి రుణాలను మహిళలకు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి మహిళ సంఘంలో సభ్యత్వం తీసుకునేలా చూడాలని పొదుపును అలవాటు చేసుకొని బ్యాంకుల ద్వారా రుణాలను పొంది స్వయం సహాయక మార్గాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం అధికారులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచన మండలి జిల్లా అధ్యక్షురాలు సుధ, కార్యదర్శి స్రవంతి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, ఏపీఎం మురహరి, సీబీఐ, ఏపీజీవీబీ, ఎస్‌బీఐ బ్యాంకుల మేనేజర్లు శివశంకర్, గురుప్రీత్‌సింగ్, శ్రీలత, ఫీల్డు ఆఫీసర్లు సత్యనారాయణ, అనూష, ఎంఎస్ కార్యదర్శి విజయశాంతి, కోశాధికారి లత, సీసీలు సందుల నర్సింహులు, సత్యనారాయణ, విజయలక్ష్మి, తిరుమల, ఆడిటర్ గోవర్ధన్, రవీందర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనూ స్వీపర్లకు అన్యాయం



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న స్వీపర్లు

జనగామ రూరల్: ఏళ్ల తరబడి పాఠశాలల్లో అనేక సేవలు అందిస్తూ పరాయి పాలనలో ఇబ్బందులు పడి పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలోనూ స్వీపర్లకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం వద్ద చేపడుతున్న పాఠశాల స్వీపర్ల దీక్షలు మంగళవారం నాటి 44వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ నెలకు రూ.27వేల వేతనం ఇవ్వాలని, 61 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్డ్‌మెంట్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీపర్లు లాలు నాయక్, నర్సింగరావు, ప్రమీల, వీరాలక్ష్మి, రాములు, భాస్కర్, అయోధ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల విక్రయం



జెండాలను చూపుతున్న రమాదేవి, తదితరులు

జనగామ రూరల్: పోస్టాఫీస్ బ్రాంచ్‌లలో జాతీయ జెండాలను విక్రయిస్తున్న పోస్టాఫీస్ సహాయ పర్యవేక్షకురాలు మూల రమాదేవి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా జాతీయ జెండాల అమ్మకాలను చేపట్టినట్లు తెలిపారు. జాతీయ జెండాను రూ.25లకు విక్రయిస్తామని, అవసరమున్న వారు అందుబాటులోని పోస్టాఫీసుల్లో కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్ మాస్టర్ శ్రీ బ్రహ్మేశ్వర్ సింగ్, అజయ్, యాదగిరి, రఘువరన్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందుకుంటున్న మహిళలు

జనగామ రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరమని ఉపాధి అధికారి ఎస్. మాధవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కెమిస్ట్రీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ డీఐటీ సహకారంతో ప్రొడక్టవిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఉపాధిపై అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో అవసరమని ఎంసీఎస్ ఎఫ్ సత్యవేద తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. డైరెక్టర్ దీప్తి రమేష్, ఈలేటి కల్పలత, మహిళలు పాల్గొన్నారు.

సాధారణ డెలివరీలకు మరో యంత్రం

- ఎంసీహెచ్‌కు చేరిన ఏవీడీసీ యంత్రం

జనగామ: జనగామ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో సాధారణ ప్రసవాలను మరింత పెంచేలా ప్రభుత్వం దృష్టి సారించింది. సాధారణ ప్రసవాల సంఖ్యలో ఎంసీహెచ్ రాష్ట్రంలోనే అత్యుత్తమంగా నిలుస్తుంది. రోజువారి డెలివరీల్లో 60 శాతం సుఖ ప్రసవాలు జరుగుతుండగా... కష్టతరంగా మారిన కొన్ని సందర్భాల్లో ఆపరేషన్లు తప్పడం లేదు. రెండు, మూడో కాన్పు మినహా.. మొదటి కాన్పుల్లో 99శాతం నార్మల్ డెలివరీలు చేసేలా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం... కష్టతరంగా మారిన సమయంలో సైతం సాధారణం సులువుగా చేసేలా ఎంసీహెచ్‌కు 'అసిస్టం వ్యాక్యూమ్ డెలివరీ సిస్టం' (ఏవీడీసీ) యంత్రాన్ని అందించింది. కడుపులో బిడ్డ అడ్డం తిరిగి, ఆపరేషన్ చేయాల్సి వచ్చిన సమయంలో ఈ యంత్రాన్ని ఉపయోగిస్తారు. ఈ యంత్రం సేవలు మంగళవారం నుంచి అందుబాటులోకి రావడంతో సాధారణ ప్రసవాల సంఖ్య మరింత పెరుగుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు తెలిపారు.



యంత్రాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్, వైద్యులు

విద్యా ప్రమాణాల పెంపునకే 'తొలిమెట్టు'

- డీఈఓ రాము



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాము

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న విద్యా ప్రమాణాల పెంపు, గుణాత్మకమైన మార్పు, విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించే లక్ష్యంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఈఓ రాము అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్(ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ) శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విద్యాప్రమాణాల పెంపు, గుణాత్మకమైన మార్పు, విద్యార్థుల కనీస సామర్థ్యాలను సాధించేందుకు తొలిమెట్టు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ ఉపేందర్‌రావు, ఏఎంఓ శ్రీనివాస్, జిల్లా అబ్జర్వర్ రఘు, జీసీడీఓ గౌసియా, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, ఎంఎస్‌ఓ అజామోహినోద్దీన్, శిక్షణ శిబిరం ఇన్‌చార్జ్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ శిబిరం సందర్శన

పాలకుర్తి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో రెండు రోజుల ఇంగ్లిష్ శిక్షణా శిబిరాన్ని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకుడు ఉపేందర్ సందర్శించారు. మంగళవారం మండల నోడల్ అధికారి నారబోయిన యాకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకుడు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ఉన్నత విద్యను ఉపాధ్యాయులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, జిల్లా పరిశీలకుడు రఘూజి, ఎఫ్‌ఎల్‌ఎస్ శిక్షణ ఇన్‌చార్జ్ పోతుగంటి నర్సయ్య, ఎంఆర్‌సీ రమేష్, కిషన్, నరేష్, అరుణ ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి హత్య!

- మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో పూడ్చిన వైనం



నాగరాజు (ఫైల్)



సెప్టిక్ ట్యాంక్‌లో నాగరాజు కాలు



రోదిస్తున్న భార్య శైలజ

దేవరుప్పుల: ఇల్లరికం అల్లుడిని హత్య చేసి ఆపై ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో పూడ్చిన సంఘటన మంగళవారం రాత్రి కామారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన రామిండ్ల నాగరాజు (45) ఇరవై ఏళ్లకిందట దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడేనికి చెందిన మేనమామ చింత అబ్బసాయిలు కూతురు శైలజను వివాహం చేసుకున్నాడు. మేనమామకు ఒక్కతే కూతురు కావడంతో ఇల్లరికం అల్లుడిగా హమాలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల కుటుంబ కలహాలతో తరచూ గొడవలు కావడంతో పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. దీంతో నాగరాజు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన నాగరాజు భార్య శైలజతో గొడవకు దిగాడు. దీంతో అత్త మామలు నాగరాజును విడిపించే క్రమంలో హత్యకు గురయ్యాడు. జరిగిన తతంగాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహాన్ని పూడ్చారు. మంగళవారం రాత్రి వరకు స్థానికులకు నాగరాజు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను ఆరా తీశారు. దీంతో భార్య శైలజ తన భర్త మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో పూడ్చానని రోదిస్తూ చెప్పడంతో విషయం బయటపడింది. విషయం తెలుసుకున్న పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రవణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని శైలజను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు యత్నించగా మృతుడి బంధువులు వచ్చేంత వరకు బయటకు తీయొద్దని గ్రామస్తులు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు రాకపోవడంతో సంఘటన స్థలంలోనే మృతదేహం ఉంది. నేడు (బుధవారం) పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.



పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

జీపీఎఫ్ డబ్బులు జమ చేయాలి

జనగామ రూరల్: తమ అవసరాలకు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు ఖాతాల్లో జమ కాక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన జిల్లాల ఏర్పాటు జరిగి 317 జీఓ ద్వారా ఉద్యోగుల విభజన జరిగి రెండు ఏళ్లు గడిచినా జీపీఎఫ్ డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే డబ్బులు ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వైభవంగా బోనాల వేడుకలు

కొడకండ్ల: మండలకేంద్రంలో మంగళవారం బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. మండల కేంద్ర ప్రజలు తమ ఆరాధ్యదైవంగా భావించే కాలభైరవ (బయ్యన్న), ముత్యాలమ్మకు పూజలు నిర్వహించారు. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్, మద్రాస్, బొంబాయి తదితర ప్రాంతాలకు వెళ్లిన వారంతా వేడుకలను పురస్కరించుకొని ఇళ్లకు చేరారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవతలకు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు బోనం ఎత్తుకొని మహిళలతో ఊరేగింపులో పాల్గొంది. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి కూడా బోనం ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించింది. డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు వేడుకలకు హాజరై పూజలు నిర్వహించారు. యువకుల తొట్టెల ఊరేగింపు, గంగపుత్రుల చలువ పందిళ్లతో బోనాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



బోనంతో వస్తున్న ఉషాదయాకర్‌రావు



బోనం ఎత్తుకున్న ఝాన్సీరెడ్డి

విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలి



జనగామ రూరల్: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18న పెంబర్తి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేయనున్న జనగామ విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలని జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం బాణాపురం ఏబీవీ జూనియర్ కాలేజీ బాయ్స్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థుల సమస్యల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. పలు సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 9వతేదీ నుంచి ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్ మెంటు) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 9, 11, 14, 16, 18 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ఆస్తిలో వాటా కోసం .. నిరసన

- మాజీ ఎంపీ కల్పనాదేవి వారసుడి ఆందోళన



తల్లిదండ్రుల ఫొటోలతో నిరసన చేస్తున్న మాజీ ఎంపీ కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి

హన్మకొండ చౌరస్తా: తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా తన సోదరుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మాజీ ఎంపీ, దివంగత కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్తిలో తన వాటా ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ హనుమకొండ పద్మాక్షికాలనీలోని జయ నర్సింగ్ కళాశాల ఎదుట మంగళవారం అమ్మ, నాన్న ఫొటోలను వెంటబెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉరితాళ్లతో నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న పలువురు స్థానికులు జయసింహారెడ్డి ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆస్తిలో భాగమైన 60 ఎకరాలను తనకు తెలియకుండా సోదరుడు నర్సింగరెడ్డి రియల్ ఎస్టేట్‌కు అప్పగించాడని, వారసత్వ ఆస్తుల లెక్కలు తేల్చకుండా పత్రాలను దాచిపెట్టి తనకు వాటా దక్కకుండా ఒక్కడే అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా నర్సింగరెడ్డి తన ఆస్తుల, ఆదాయ లెక్కలను తేల్చి తనకు రావాల్సిన వాటా ఇవ్వకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు.

అడవే అమ్మ ఒడి..

విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం ఏజెన్సీ గూడేలు

- ప్రకృతితోనే జీవన గమనం
- పూర్వీకుల నుంచి ఆచరణ
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం : చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో కొండలు..గుట్టలు, ఆ మధ్యలో ఆవసాలు.. వాటి చుట్టు ఉండే వాగులు.. వంకలు..సెలయేరులు.. అటవీ జంతువులతో సహవాసం.. ప్రకృతితో మమేకం. ఇవి ఆదివాసీల జీవన విధానానికి ప్రతీక. బహ్య ప్రపంచానికి ఏ మాత్రం సంబంధం లేని జీవన విధానం వారి సొంతం. మైదాన ప్రాంత భాష, అలవాట్లు, ఆచారం, ఆహార్యానికి పూర్తి విరుద్ధం. ప్రపంచం కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా ఇప్పటికీ తమ ఆచారం, సంప్రదాయం, సంస్కృతులను అలాగే కొనసాగిస్తున్నారు. అడవిలో లభించే దుంపలు..ఇతర కాయలు ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. నీరు, అటవీ ప్రాంతాలనే ఆసరా చేసుకుని నాడు పూర్వీకులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నాటి ఆవాసాలే నేటి ఆదివాసీ గూడేలు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సమావేశం

ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. 1982 ఆగస్టు 9న జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల సంఘం నిపుణులతో సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను పరిరక్షించడంతోపాటు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 70 దేశాల్లో 5వేల తెగలకు చెందిన 40 కోట్ల జనాభా ఉందని సమాచారం. ఆదివాసీలు 6700 భాషలు మాట్లాడుతున్నారు. దేశంలో 461 రకాల ఆదివాసీ తెగలు ఉండగా 92 శాతం వరకు అటవీ ప్రాంతంలో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అడవులు, కొండలతో నిండి ఉంటుంది. గూడేలు, పెంటల్లో ఆదివాసీ మానవ సమాజం తొలిబిడ్డలు గోండు, కోయ, కోలాం, ప్రర్ధాన్, నాయక్‌పోడ్, బగత, జాతపు, కొండారెడ్డి, చెంచు, ఖోందు, అంధ్, ముఖదొర, ఆరోగ్యం మున్నెంవార్ వంటి జాతులున్నాయి.



కొమ్ము నృత్యం చేస్తున్న దింసా కళాకారులు (ఫైల్)

విద్య, వైద్యం కోసం నేటికీ పోరాటాలే..

అంతర్జాతీయంగా ఆదివాసీల సమస్యలు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, పర్యావరణం వంటి అంశాల పరిరక్షణకు సమితి సర్వప్రతినిధి సభ 1993లోనే తీర్మానం చేసింది. కాగా, జిగురు, బంక, ఇప్పపువ్వు, తునికాకు, చింతపండు, తేనె, చీపుర్లు, విస్తారాకులు, కలప, తదితర అటవీ ఉత్పత్తులపై ఇప్పటికీ ఆదివాసీలు ఆధారపడి జీవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. విద్య, వైద్యం కోసం ఇప్పటికీ ఏదో చోటా పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆదివాసీల చట్టాలు

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఉన్నా వనరులు దోపిడీ అవుతున్నాయని ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం వచ్చిన క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6546 మందికి మందికి పోడు పట్టాలు ఇచ్చారు.

గూడేల్లో సౌకర్యాలు కరువు

స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మౌలిక వసతులు లేక ఆదివాసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలకు ప్రభుత్వాలు ఇప్పటి వరకూ కనీస వసతులు కల్పించలేకపోయాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంటున్నారనే ఒకే కారణం వారికి శాపంగా మారింది. రోడ్లు ఉండవు.. తాగు నీరు లేదు. విద్యుత్ సరఫరా, పక్కా ఇళ్లు, పాఠశాలు, పౌష్టికాహారం కూడా లేని దీనస్థితిలో గొత్తికోయలు కాలం వెళ్లదీస్తున్నారు.



చింతలమోరి గొత్తికోయగూడెం

నృత్యాలు

ఆదివాసీలోని పలు రకాల తెగల్లో ఒక్కొక్కరు ఒక్క రకమైన నృత్యం చేస్తారు. ఇందులో కొమ్ము నృత్యం, దింసా, డోలు నృత్యాలు ఉంటాయి. ఈ నృత్యాలు పెళ్లిళ్లు, జాతర, పండుగల సమయంలో ఎక్కువగా చేస్తారు.



కంతనపల్లి అడవిలో నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)

ఆదివాసీల హక్కులను కాపాడాలి



ఆదివాసీల హక్కులను కాపాడాలి. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు పాలకులు మారినా ఆదివాసీల రాతలు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ పథకాలు కింది స్థాయికి చేరితేనే అభివృద్ధి సాధ్యం. దీనిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడాలి.

– కొప్పుల సరిత, ఆదివాసీ మహిళ, ఏటూరునాగారం

సంస్కృతిని పరిరక్షించాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా చూడాలి. పండుగలు, ఆచారాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. వాటికి ప్రత్యేక ప్యాకేజీ కల్పించి ఘనంగా జరపాలి.

– కబ్బాక శ్రావణ్, ఏటూరునాగారం

ఆచారాలు, సంప్రదాయాలు

కోయ మహిళలు నేల మీదే ప్రసవిస్తారు. మంత్రసానులు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టెలో వేసి బారసాల చేయడం వారి ఆచారం. పిల్లల పేర్లు ఇలవెల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువగా ఉంటాయి.

పండుగలు.. దేవతలు

కోయల పండుగలు విభిన్నం.. విశిష్టం. వీరు ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండగ, సూరాల పండుగ, సుంకుల పండుగ చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకుంటారు.

బావమరిది మృతదేహం తీసుకొస్తుండగా ప్రమాదం.. బావ మృతి

మరిపెడ/బయ్యారం: అనారోగ్యంతో చనిపోయిన బావమరిది మృతదేహన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ మృతిచెందాడు. ఈ దుర్ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన ముద్ద సారయ్య(40) బావమరిది అదే గ్రామానికి చెందిన గజ్జి సంపత్(43) హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతన్ని మృతదేహన్ని బావ సారయ్య ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మరిపెడ మీదుగా స్వగ్రామానికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై కాలువవెంట నిర్మించిన రోడ్డు వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ముందు కూర్చున్న సారయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అందులో ప్రయాణిస్తున్న గజ్జి అప్పయ్య, డ్రైవర్ శివకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.



సారయ్య (ఫైల్)



సంపత్ (ఫైల్)

రైలుకు వెళ్లినా బతికేవాడు..

సారయ్య భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బావమరిది సంపత్ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి సారపాక వెళ్లేందుకు రైలు టికెట్ సైతం రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ బావమరిది చనిపోవడంతో అంబులెన్స్‌లో రావాల్సి వచ్చింది. రైలుకు వెళ్లినా ప్రాణంతో ఉండేవాడని బంధువులు విలపించారు.



పక్కపక్కనే పేర్చిన బావ, బావమరుదుల చితిల వద్ద విషాదంలో బంధువులు

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం



సభలో ఐక్యతా అభివాదం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ నాయకులు

- కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కు తిరిగేందుకు రూ.79 కోట్ల ఖర్చు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- పబ్లిక్‌గార్డెన్‌లో 'బహుజన విద్యార్థి భరోసా' సభ



ర్యాలీగా వస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విద్యార్థులను పట్టించుకోని కేసీఆర్ దుకాణం బంద్ చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతి భవన్ మధ్య తిరగడానికి ఏడాదికి రూ.79 కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మంగళవారం 'బహుజన విద్యార్థి భరోసా' సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. అంతకుముందు అదాలత్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు, అనంతరం విద్యార్థులతో కలిసి బైక్ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పేపర్ లీకేజీ సమయంలో అందరికీ అందుబాటులో ఉచితంగా కోచింగ్ మెటీరియల్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, కానీ బహుజనుల రాజ్యంలో ఏసీ కోచింగ్ సెంటర్లు, ఉచితంగా వైఫై, కంప్యూటర్ సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. బహుజన రాజ్యంలో పేపర్ లీకేజీలు ఉండవని, అలాంటి నేరాలకు పాల్పడితే యావజ్జీవ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో 90శాతం మందు దొరుకుతుంది కానీ వైద్యం అందడం లేదని మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన 200 ఎకరాలు భూమిని దొంగలు కబ్జా చేశారని ఆరోపించారు. దళిత, బీసీ, మైనారిటీ బంధు పేర్లతో కేసీఆర్ వస్తున్నాడు కానీ ఆయన దుకాణం బంద్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఆర్‌ఎస్‌పీ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ విద్యార్థి మేనిఫెస్టోను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్, బొట్ల కార్తీక్, మాదారపు రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణక్వీన్, వరంగల్ రీజియల్ సెక్రటరీ కన్నం సునీల్, జిల్లా నాయకులు సారయ్య, మంద శ్యాం, శనిగరపు రాజు, రజిత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి కడుగుతుండగా..

- పాము కాటు.. చికిత్స పొందుతూ వివాహిత మృతి
- పలివేల్పులలో ఘటన



పద్మ (ఫైల్)

హసన్‌పర్తి : ఇంటి సామగ్రి కడుగుతుండగా పాము కాటు వేసింది. దీంతో ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం నగరంలోని పలువేల్పులలో జరిగింది. పలివేల్పులకు చెందిన సల్లా పద్మ(38) ఉదయం ఇంటి ఆవరణలో సామగ్రి (బోళ్లు) కడుగుతుండగా పాము కాటు వేసింది. వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య..

అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం హసన్‌పర్తి మండలం భైరాన్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన భైరి సాంబరెడ్డి(58), అవసరాల నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పు చేశారు. తీర్చే మార్గం కనిపించక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, మృతుల కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లావెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్‌చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు యువతి యత్నం



చికిత్స పొందుతున్న ప్రభావతి

గూడూరు: ప్రియుడి పెళ్లికి నిరాకరించాడనే కారణంతో ఓ యువతి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ ప్రభావతి, శివాలయం వీధికి చెందిన కస్నబోయిన కార్తీక్ ప్రేమించుకుంటున్నారు. కాగా, కార్తీక్ పెళ్లి నిరాకరిస్తున్నాడని ప్రభావతి ఆదివారం అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. అదే రోజు రాత్రి కార్తీక్ నర్సంపేట బస్టాండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా బీసీ వర్గానికి చెందిన కార్తీక్.. కొందరి మాటలు విని తన ప్రేమను అంగీకరించడం లేదని ప్రభావతి మనోవేదన గురైంది. ఈ క్రమంలో తాను పురుగుల మందు తాగుతున్నానని, తన మృతికి కార్తీక్‌తోపాటు ప్రేమను కాదంటున్న ఆయన కుటుంబ సభ్యులే కారణమని ఓ లెటర్ రాసింది. అనంతరం పురుగుల మందు తాగింది. ఈ విషయం తల్లికి తెలుపగా కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రభావతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన (పోక్సో) కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పరకాల పట్టణానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని.. లేదంటే మీ అమ్మానాన్నను చంపుతానని వరంగల్ రంగంపేటకు చెందిన వివాహితుడు మహ్మద్ సమీర్ అలియాస్ సాజిత్ 2019 ఏప్రిల్ 24న రాత్రి బెదిరించి వెంట తీసుకెళ్లాడు. 15 రోజులు వివిధ ప్రాంతాల్లో తిప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో సాజిత్‌కు జైలుశిక్షతోపాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ జడ్జి టి.జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసులు అధికారులు మధు, రవికిరణ్, వెంకటరత్నం పరిశోధించగా.. వైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెచ్‌సీ సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థుల ఆందోళన



గేట్ వద్దనే భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల (ఎస్‌ఎఫ్‌సీ) విద్యార్థులు తమకు హాస్టళ్ల వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం నుంచి మొదటి గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి 11గంటల వరకు కూడా కొనసాగింది. అక్కడే బయటి హాస్టల్‌నుంచి తెచ్చిన సహపంక్తి భోజనాలు చేశారు. మహిళా హాస్టల్‌లో సెల్ఫ్‌ఫైనాన్స్‌కోర్సుల విద్యార్థులు కొందరు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఈ నెల 7న అధికారులు వారిని ఖాళీ చేయించారు. మంగళవారం కూడా పలువురు విద్యార్థినులను ఖాళీ చేయించి బ్యాగులు బయటపెట్టారని ఆరోపిస్తున్నారు. తాము ఎక్కడ ఉండి చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉందని, టైంటేబుల్‌ను కూడా వెల్లడించారని తెలిపారు. యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో హాస్టల్ వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు వివిధ విద్యార్థి సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థులు వినలేదు. వీసీ వచ్చి తమకు హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యను వివరణ కోరగా మరో 15 రోజుల్లో ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. 15నుంచి 20మంది వరకు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఖాళీ చేయించామని తెలిపారు.

పోలీసులతో వాగ్వాదం..

గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అక్కడినుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొంత తోపులాడుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పోలీసులు వెళ్లిపోవడంతో విద్యార్థులు ఆందోళన కొనసాగించారు.